గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు అన్నారు. శనివారం మహదేవపట్నంలో నాగరాజుకు పలువురు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలను నిర్లక్ష్యం చేశారన్నారు. జిల్లాలోని ఎంఎల్‌ఎలు, డిప్యూటీ స్పీకర్ సహకారంతో అవసరమైన చోట మరమ్మతులు, పునర్నిర్మాణాలు చేసి గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. కార్యక్రమంలో మహదేవపట్నం గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, ఆకివీడు ఎఎంసి చైర్మన్ బొల్లా వెంకట్రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలకు వరం.. భీమవరం బాలోత్సవం

ఎస్ఆర్‌కెఆర్‌లో ముగిసిన మూడో పిల్లల సంబరాలు

రెండు రోజులపాటు ఆట..పాట.. మాటలతో చిచ్చర పిడుగుల కేరింతలు

5 వేల మందికి ప్రశంసాపత్రాలు, మరో వెయ్యి మందికి మెడల్స్, మెమెంటోలు బహూకరణ

నాయకత్వ లక్షణాల పెంపునకు దోహదం: ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి

మాట్లాడుతున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం

సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి మురిపించిన చిన్నారులు... గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా సాగిన జానపద నృత్య ప్రదర్శనలు... దేశభక్తి ఉప్పొంగేలా అభ్యుదయ గీతాలపనలు... కోలాహలంగా కోలాటాలు.. బుడిబుడి అడుగులు, వచ్చి రాని మాటలతో విచిత్ర వేషధారణలు.. ఆలోచింపజేసిన లఘు నాటికలు.. అబ్బురపరిచిన అనేక సన్నివేశాలు.. భీమవరం బాలోత్సవాల్లో కనువిందు చేశాయి. చూపరులను ఆకట్టుకుని.. మది నిండా ఆనందాన్ని నింపాయి. శుక్ర, శనివారాల్లో రెండు రోజులు సాగిన బాలోత్సవ సంబరాలు అంబరాన్నంటి అత్యంత వైభవంగా ముగిశాయి.

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు సాగిన భీమవరం బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు శనివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. భీమవరం పట్టణం, మండలం, వీరవాసరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల్లోని 590 పాఠశాలల్లోని ఎల్‌కెజి నుండి పదో తరగతి విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు. తరగతి గదుల్లో 15 అకడమిక్, నాలుగు వేదికలపై 18 కల్చరల్ అంశాల్లో విద్యార్థులు ఏకకాలంలో ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ చాటారు. సుమారు ఆరు వేల మంది చిన్నారులు, విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. వీరందరికీ రెండు రోజులు అల్పాహారం, భోజనాలు, స్నాక్స్ బాలోత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. మొదటిరోజు బాలోత్సవాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి ప్రారంభించారు. బాలల్లో మేధాశక్తి, ఆత్మవిశ్వాసం పెంపునకు బాలోత్సవాలు దోహదపడతాయన్నారు. ఇంత పెద్దసంఖ్యలో బాలలను చూస్తుంటే తమకెంతో సంతోషంగా ఉందని నిర్వాహణ కమిటీని అభినందించారు. రెండో రోజు సంబరాలను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, డిటిజి మహ్మద్ మజుర్ బేగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి నిశాంత్‌వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎస్‌పి నయీమ్ అద్నాన్ అస్మి మాట్లాడుతూ బాలోత్సవాల వల్ల అనేక ఉపయోగాలున్నాయన్నారు. విద్యార్థుల్లో కృషి, పట్టుదల పెరగడంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి దోహదపడతాయన్నారు. ఇంత పెద్దఎత్తున బాలోత్సవాలను

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మాట్లాడుతున్న నారాయణ

మాట్లాడుతున్న నిశాంత్‌వర్మ

నిర్వహించడం అభినందనీయమన్నారు. డిటిజి మహ్మద్ మజీర్ బేగ్ మాట్లాడుతూ విద్యార్థులు దాగున్న సృజనాత్మకతను వెలికితీసేలా చక్కని కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నిశాంత్‌వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో అంగరంగ వైభవంగా బాలోత్సవాలను నిర్వహించడం జీవితంలో మర్చిపోలేనిదన్నారు. సేవా కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు తమ కళాశాల పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి, డిటిజి, నిశాంత్‌వర్మలను నిర్వహణా కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవాల నిర్వాహకులు రావు రాజు, ఎ ఎన్ వి భీమారావు, ఎస్ఆర్‌కెఆర్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కె.మురళీకృష్ణంరాజు, సిఇఒ సిహెచ్.దిలీప్‌చక్రవర్తి, ఎస్‌టిఒ అల్లూరి రవివర్మ, ఎం.సరోజిని పాల్గొన్నారు.

బాలోత్సవాలు జిల్లా అంతా విస్తరింపజేయాలి

డిఇఒ ఇ.నారాయణ

భీమవరం బాలోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, అయితే ఇది భీమవరానికే పరిమితం కాకుండా జిల్లా అంతటా విస్తరింపజేయాలని డిఇఒ ఇ.నారాయణ అన్నారు. బాలోత్సవ సంబరాల ముగింపులో బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రెండు రోజులపాటు పిల్లల సంబరాలను నిర్వహించడం అనేది సాధారణ విషయం కాదన్నారు. నిర్వహణ కమిటీ ఎంతో శ్రమించి ఈ స్థాయిలో సంబరాలను విజయవంతం చేశారని అభినందించారు. జిల్లాలో బాలోత్సవాలు ఏ ప్రాంతంలో నిర్వహించినా జిల్లా విద్యా శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని ప్రకటించారు.

5 వేల మందికి ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమొంటోలు బహూకరణ

రెండు రోజులపాటు నిర్వహించిన మూడో పిల్లల సంబరాల్లో చిన్నారులు, ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు సుమారు ఆరు వేల మంది పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి పోటీలో రంగాలవారీగా పాల్గొని ప్రతిభ చూపారు. బాలోత్సవాల నిర్వహణ కమిటీ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేసింది. సుమారు ఐదు వేల మంది చిన్నారులకు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమెంటోలు బహూకరించింది.

దాతల సహకారం మరువలేనిది

బాలోత్సవాల నిర్వహణ కమిటీ

భీమవరం బాలోత్సవాలు మూడో పిల్లల సంబరాలు ఇంత వైభవంగా జరగడానికి ముఖ్య కారణమైన దాతల సహకారం మరువలేనిదని బాలోత్సవ నిర్వహణా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. బాలోత్సవ నిర్వహణ, ఏర్పాట్లకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమాల్లో భీమవరం బాలోత్సవం అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యక్షులు గాతల జేమ్స్, కోశాధికారి పాకలపాటి సీతారామరాజు, అకడమిక్ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, కల్చరల్ కన్వీనర్ బి.చైతన్య ప్రసాద్, కార్యదర్శి రఘయేలు, కె.అశోక్, సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం

కలెక్టర్ చదలవాడ నాగరాణి - గోదావరి క్రీడోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

శారీరక, మానసిక దృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఉద్యోగులు తమ విధుల నిర్వహణతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. గోదావరి క్రీడోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో భీమవరం డివిజన్ ఉద్యోగుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గోదావరి క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్లవారీగా పోటీలు ప్రారంభించుకున్నారన్నారు. ఒకప్పుడు క్రీడా పోటీలు అంటే రెవెన్యూ, పోలీస్ శాఖలో మాత్రమే జరిగేవని, నేడు జిల్లావ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతో ఈ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. భీమవరం డివిజన్ పరిధిలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసాపురం పరిధిలో వైఎన్ కళాశాల, తాడేపల్లిగూడెం పరిధిలో శశి కళాశాల్లోనూ క్రీడలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, చదరంగం, క్యారమ్స్, షాట్‌పుట్, టెన్నికాయిట్, త్రోబాల్ వంటి విభాగాల్లో మహిళలకు, పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల ద్వారా ఉద్యోగుల్లో స్నేహపూర్వక వాతావరణం, శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుందన్నారు. పని ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో 35 శాఖలకు చెందిన 3,500 మంది అధికారులు, ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. డివిజన్ స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులతో పరిచయం అనంతరం క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలను ప్రారంభించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీల్లో పాల్గొని ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ

భీమవరంలో ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న కలెక్టర్

బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.రామచంద్రారెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.మోహన్‌దాస్, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, బిసి సంక్షేమ శాఖాధికారి ఎవి.సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు పాల్గొన్నారు.

నరసాపురం: క్రీడలు మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎన్ కళాశాల పీజీ క్యాంపస్ గ్రౌండ్‌లో నరసాపురం డివిజన్ స్థాయి ఉద్యోగుల క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, టెన్నిస్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెసితోపాటు ఆర్‌డిఒ దాసిరాజు స్వయంగా క్రీడల్లో పాల్గొని ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఐతం సత్యనారాయణ, రాజ్‌కిషోర్, ఇఇ కె.మధుకుమార్ పాల్గొన్నారు.

సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బండి రంగారావు పిలుపునిచ్చారు. ఈ మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు జరగనున్నాయని, వీటిని కార్మికులు జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఆచంటలో గ్యాస్ కార్మికులు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ వర్కర్లు ఎర్రగుప్పుల బాలాజీ, చిక్కాల బాలాజీ, గంటి ఏడుకొండలు, కొత్తపల్లి మల్లి, సమంతకూరి శ్రీనివాసరావు, కడలి సునీల్, బండారు ఏసు, ఇంటి సురేష్ పాల్గొన్నారు.

ఆచంటలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గ్యాస్ వర్కర్లు

కాళ్ల : సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు మండా సూరిబాబు కోరారు. శనివారం కాళ్లలో ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇంటింటికీ తిరిగి నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మండా సూరిబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరుగుతున్న ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని, దానికోసం అందరూ విధిగా విరాళాలు అందించాలని కోరారు. సిఐటియు దేశవ్యాప్తంగా ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 26 వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ యిర్రింకి ఏడుకొండలు, ఆశా వర్కర్స్ యూనియన్ నేత అనిత, మరియమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల నుండి రూ.7 లక్షలు రికవరీ

నలుగురు అరెస్టు: ఎఎస్‌పి వి.భీమారావు

ప్రజాశక్తి - ఆకివీడు

సైబర్ నేరగాళ్ల ముఠా నుంచి రూ.ఏడులక్షలు ఆకివీడు పోలీసులు రికవరీ చేశారు. ఇటీవల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని రూ.93.50 లక్షలు పోగొట్టుకున్నారని, దానిలో మొదటి నేరస్తుడి నుంచి రూ.7.34 లక్షలు రికవరీ చేశామని ఎఎస్‌పి వి.భీమారావు తెలిపారు. దీనికి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఆయన చెప్పారు. శనివారం స్థానిక సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రెండు నెలల క్రితం తాను సొమ్ము కోల్పోయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని, అప్పటికే డబ్బులు పోగొట్టుకుని రెండు నెలలు దాటిపోయిందని తెలిపారు. అయినా ప్రయత్నం చేశామని అన్నారు. వెంటనే ఫిర్యాదు చేసి ఉంటే దోషులను పట్టుకోవడం తేలికయ్యేదన్నారు. విశాఖపట్నంకు చెందిన సబ్బి జగదీశ్ రెడ్డి (31),

మాట్లాడుతున్న ఎఎస్‌పి వి.భీమారావు

మహారాష్ట్రకు చెందిన ఆరిఫ్ మహమ్మద్ (39), హైదరాబాద్‌కు చెందిన పూసనూరి రాధారాణి (40), మహారాష్ట్రకు చెందిన షాహిద్ లతీఫ్ షేక్ (21)లను ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో సిఐ జగదీశ్వర్‌రావు, ఎస్‌ఐలు హెచ్.నాగరాజు, ఎం.నాగరాజు, ఎమ్‌డి.నజిరుల్లా, ఎం.శ్రీనివాసరావు, వంశీ, రెహమాన్, వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారని, వారికి రివార్డు అందజేశారు.

పెదపుల్లేరు రూరల్ బ్యాంక్ చైర్మన్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - ఉండి



వరలక్ష్మి(ఫైల్‌ఫొటో)

పెద్దపుల్లేరు విశాల పరపతి సహకార సంఘం (రూరల్ బ్యాంక్) చైర్మన్ కలిదిండి గోపాలకృష్ణంరాజు తల్లి వరలక్ష్మి (85) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం కన్నుమశారు. వరలక్ష్మి భర్త కలిదిండి గొల్లరాజు 36 సంవత్సరాలు గ్రామ సర్పంచిగా పని చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. వరలక్ష్మికి నలుగురు సంతానం. వారిలో ఒక కుమారుడు ఉండి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు కలిదిండి సీతారామరాజు గత ప్రభుత్వ హయాంలో రూరల్ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మరో కుమారుడు గోపాలకృష్ణంరాజు ప్రస్తుతం రూరల్ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు, స్థానిక నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు వరలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నాయకర్‌కు పెన్షనర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - నరసాపురం

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నరసాపురం యూనిట్ శనివారం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పెన్షన్ అసోసియేషన్ సంఘం భవనానికి అదనపు గదుల నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి డబ్బులు ఇప్పించాలని ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం యూనిట్ పెన్షనర్ యూనియన్ నాయకులు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.మార్కండేయులు, ఆర్ఆర్‌కె.రాజు, కోశాధికారి వై.స్వామినాయుడు, అడ్వయిజర్ కెఎస్‌వి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ సిహెచ్ విఆర్ కె.సాగర్, ఎఎస్ఆర్‌ఎ.మూర్తి పాల్గొన్నారు.

సమస్యల హోరు.. మారని తీరు..!

రెండు జిల్లాల్లో ప్రజా సమస్యలు హోరెత్తుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే పాలకులు, అధికారులు ఎన్ని చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలకు అడ్డే లేదని ఏలూరు, జీలుగుమిల్లి ప్రాంతాల్లోని ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. జిల్లాల పునర్విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటు పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన అంశాలు ఆయా ప్రాంతాల్లో ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జనం వ్యక్తిగత, ప్రాంతీయ, సామాజిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఇది ప్రతిపక్ష నేతలో, ప్రజాసంఘాల నేతలో చెప్పారనుకుంటే ఉద్దేశపూర్వకం అనుకోవచ్చు. కానీ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారమూ నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌కు వస్తున్న అర్జీలు ఒక ఉదాహరణ అయితే, తాజాగా ప్రజాదర్బార్, జనవాణి పేరిట అధికార టిడిపి, జనసేన ఎంఎల్‌ఎలు తమ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో సమస్యలు పరిష్కరించాలని తరలొస్తున్న జనమే ప్రత్యక్ష నిదర్శనం. ప్రధానంగా ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్య, పింఛన్లు, రోడ్లు, భూ సమస్యలపై వినతులు ఎక్కువగా వస్తున్నాయి. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్ని అర్జీలిచ్చినా పరిష్కారం కాని భూ సమస్యలు కాసులిస్తే క్షణాల్లో పని పూర్తయిపోతుందని, తాము డబ్బులిచ్చుకోలేక అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నామని పేద, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. ఇక రోడ్ల వంటి సమస్యలపై హామీలివ్వడం తప్ప కార్యాచరణలో ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి. ఇక ఇళ్లు , ఇళ్ల స్థలాలు, పింఛన్ల విషయంలో ప్రభుత్వం నుంచే కదలిక రావాల్సి ఉంది. వీటి విషయంలో ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకుంటే తప్ప ఈ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం మాత్రం ఆరు నెలలకోసారి పింఛనుదారులు ఎవరైనా మృతి చెందితే వారి స్థానంలో కొత్త వారికి ఇవ్వడం తప్ప, అర్హులందరికీ పింఛన్ ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఆ సమస్యలన్నీ అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. దీంతో అధికారులకు మాత్రం తిప్పలు తప్పడం లేదని స్పష్టమవుతోంది.

ఇక జిల్లా కేంద్రమైన ఏలూరు నడిబొడ్డున పాత నేరస్తుడు ఒక యువతిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడంటే శాంతిభద్రతల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇది రాత్రివేళల్లో



పోలీసింగ్ పెరగాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. ఇక జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఏడో నెల గర్భిణి అయ్యే వరకూ ప్రిన్సిపల్, వార్డెన్ గుర్తించకపోవడం విద్యార్థుల పట్ల అధికారులు, సిబ్బంది ఏపాటి శ్రద్ధ వహిస్తున్నారో స్పష్టమవుతోంది. ప్రతి హాస్టల్‌లో నెల నుంచి మూడు నెలల్లోపే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహింపజేస్తున్నామని అధికారులు చెప్పే మాటలన్నీ అవాస్తవాలని మరోసారి స్పష్టమైంది. కారణమేదైనా ప్రిన్సిపల్, డిప్యూటీ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. అదే రీతిలో జంగారెడ్డిగూడెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి ఎటువంటి చర్యలూ లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పైగా ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని కోరిన విద్యార్థిని బంధువులు, ప్రజాసంఘాల నేతలపై కేసులు పెట్టడం, బెదిరింపులకు దిగడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ ఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్, ఎస్‌పి రంగంలోకి దిగి ఆయా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ధైర్యం చెప్పడంతోపాటు డివిజన్, మండలస్థాయి అధికారులు తరచూ వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటే పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలనే డిమాండ్ బలంగా విన్పిస్తోంది. సిపిఎం, ప్రజాసంఘాల జెఎసి నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. వేలేరుపాడులో ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు జిల్లా సాధన కమిటీ నేతలు వినతిపత్రం అందించారు. ఆయన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలిపేలా చూస్తానని హామీ ఇచ్చారు. సిఎం, డిప్యూటీ సిఎం హోదాలో ఉన్న ఇరువురు ఎన్నికల ముందు కూటమి నేతలుగా పోలవరం జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చిన వారే. అదీ ప్రధానంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉంటుందని సైతం చెప్పారు. దానికి భిన్నంగా ముసాయిదా నోటిఫికేషన్ వెలువడింది. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం స్పందిస్తే పోలవరం నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేరే అవకాశం ఉంది. దానికోసం నెలాఖరు వరకూ నిరీక్షించక తప్పదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నేతలు ఉవ్విళ్లూరుతుండగా పంచాయతీల విభజన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి వచ్చింది. ఇప్పటికే గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఇవీగాక పలు చోట్ల పంచాయతీలను విభజించాలనే డిమాండ్ ఉంది. ఈ రూపంలో కొన్నిచోట్ల గతంలో స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించిన పరిస్థితీ ఉంది. ఈ సారైనా ఈ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపుతుందో.. లేక నాన్చుతుందో వేచిచూడాలి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి

సమస్యలపై పోరాడేది సిపిఎంనే

కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి

పేరుపాలెం బీచ్‌లో నేతల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసే సిపిఎం నాయకులు ఆటవిడుపుగా పేరుపాలెం బీచ్ తీరంలో జిల్లాస్థాయి ఆత్మీయ సమ్మేళనం పేరిట శనివారం ఆట, పాటలతో గడిపారు. ఐద్వా ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం సిపిఎంతోనే సాధ్యమని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. పోరాటాలకు ఆటవిడుపుగా బీచ్‌లో కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నేటి సమాజంలో పలువురు స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డదారులు వెతుకుతున్నారని, దీనిలో భాగంగానే డ్రగ్స్, గంజాయి వినియోగం పెరిగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. దీంతో యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒత్తిడి ఫలితమే దీనికి కారణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం, నేతలు కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కళ్యాణి, పొగాకు పూర్ణ, ముచ్చర్ల త్రిమూర్తులు, ఎడ్ల చిట్టిబాబు, తెలగంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరినాథ్ రెడ్డి

మొయ్యేరు సొసైటీ ఆధ్వర్యాన నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

మొయ్యేరు సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. నేత్ర పరీక్షా కార్యక్రమాన్ని సొసైటీ ఛైర్మన్ కానుమిల్లి వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. తమ సొసైటీ రైతులకు సేవలందించడంతో పాటు ప్రజలకు సేవలందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సొసైటీ అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తామన్నారు. కంటి పరీక్షలకు సొసైటీ పరిధిలోని గ్రామాల ప్రజలు హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ ఎండి శ్రీనివాస్ రావు, మాజీ సర్పంచి ఇంటూరి చంద్రమోహన్, సొసైటీ డైరెక్టర్లు గంటా రామకృష్ణ గుత్తుల వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు ఇంటూరి పాపయ్య చౌదరి, గొడవర్తి వెంకటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు కొల్లేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం బొబ్బిలి వంతెన నుంచి భీమవరం వెళ్లే రహదారి వరకూ రోడ్డు నిర్మించడానికి రూ.50 లక్షల నిధులు ప్రభుత్వం కేటాయించినట్లు ఆర్అండ్‌బి జెఇ డికె.రవిబాబు శనివారం చెప్పారు. బొబ్బిలి వంతెనకు ఇరువైపులా ఉన్న పుట్ పాత్ శిథిలావస్థకు చేరి రంధ్రాలు పడడంతో బాటసారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాటసారులు పుట్‌పాత్ పైనుంచి నడవకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గణపవరం నుండి పిప్పర, గణపవరం నుంచి భీమవరం వెళ్లే రోడ్డు నిర్మించడానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.


నందమూరుగరువులో సాయిబాబును సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ

సాయిబాబుకు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యా విధానాన్ని పరిశీలించడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపడం రాష్ట్ర విద్యా చరిత్రలో గొప్ప విప్లవాత్మక చర్యని నందమూరుగరువు సర్పంచి మేకల వెంకటచలపతి అన్నారు. పాలకోడేరు మండలంలో వేంద్ర హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నందమూరు గరువుకు చెందిన పంపన సాయిబాబు ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి నందమూరుగరువు ఆంజనేయ ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సాయిబాబు అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. ఇటీవల సాయిబాబు సింగపూర్ వెళ్లి అక్కడ విద్యా విధానాన్ని అధ్యయనం చేసినట్లు తెలిపారు. మండల స్థాయి నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా అనేక పురస్కారాలు, అవార్డులు అందుకున్నారన్నారు. సన్మాన గ్రహీత సాయిబాబు మాట్లాడుతూ ఈ సన్మానం తనకు ఎంతో మధురానుభూతిగా మిగులుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి శ్రీనివాసరావు, నక్కెళ్ల అప్పారావు, గుండా రామకృష్ణ, మట్టా నళినీమోహన్, ఎస్ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధికి సహకరిస్తా

ఎంపీ సత్యనారాయణకు బ్లూ ప్రింట్ అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ పాకా సత్యనారాయణ అన్నారు. మండలంలో చేయాల్సిన అభివృద్ధిపై తయారు చేసిన బ్లూ ప్రింట్‌ను ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపిడిఒ వైభవతి, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ ఎంపీకి భీమవరంలో ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. గతంలో ఎంపీ వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీ సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో తమ మండలానికి నిధులు కేటాయించాలంటూ ఎంపిపి దుర్గాభవాని ఎంపీని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి మాట్లాడారు. అభివృద్ధి అనేది ప్రాధాన్యతా క్రమంలో జరగాలని, వీరవాసరం మండలంలో ఏ పనులు ముందుగా చేయాలో ఈ శాఖల పరిధిలో నిధులు అవసరమవుతాయో తనకు ఒక బ్లూ ప్రింట్ ఇవ్వాలని కోరారు. దీంతో వీరవాసరం మండలంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల్లో చేపట్టాల్సిన వివరాలను అంచనాలతో రూపొందించి బ్లూ ప్రింట్ రూపంలో ఎంపీకి అందజేశారు.

తెరుచుకున్న పాలకొల్లు రైల్వే గేటు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి కావడంతో శనివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు గేటు తెరిచి ట్రాఫిక్‌ను వదిలారు. అయితే ఇంకా మరమ్మతులు పూర్తికాలేదని రాళ్లతో ఉన్నాయని కొందరు అనుమానం పడుతున్నారు. అయితే కొన్ని రోజులపాటు రాళ్లు సరి అయ్యాక మరలా తారు వేస్తారు. ఈ లోపు గేటు తెరిచినట్లు పోలీసులు, రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన రైల్వే ట్రాక్ మరమ్మతుల కోసం రైల్వే గేట్ మూసివేశారు. అయితే 14వ తేదీ వరకూ సమయం తీసుకున్నా ఈలోపే పని పూర్తికావడంతో రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్‌ను వదిలారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో పలుచోట్ల జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు మండల అధ్యక్షుడు వెలగలబుల్లి రామిరెడ్డి ఇక్కడ తెలిపారు. ఆదివారం ఓడూరులో పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం ఆలమూరులోని పిహెచ్‌సిలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనం (ఇంటీరియల్ ల్యాబ్) రూ.50 లక్షలతో నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే బ్రాహ్మణచెరువు - వీరవాసరం రహదారిపై బ్రాహ్మణ చెరువు నుంచి పొలమూరు శివారు వరకూ రహదారి నిర్మాణం పనులకు ఎంఎల్ఎ భూమి పూజ నిర్వహించనున్నారు. ఇక్కడ రూ.2.50 కోట్లతో నిర్మాణం పనుల కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

పల్లె ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని వల్లూరు పంచాయతీ పరిధిలో రెండు 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. అనంతరం కరుగోరుమిల్లి, పెనుమంచిలి గ్రామాల్లో చెత్త సేకరణకు గాను నూతన వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలకు దీటుగా ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేస్తోందన్నారు. గ్రామాల్లో ప్రాథమిక అవసరాలైన పారిశుధ్య, రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్ తాగునీరు వంటి ప్రధాన సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధిలో అటు ప్రభుత్వంతోపాటు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వల్లూరు, పెనుమంచిలి, కరుగోరుమిల్లి గ్రామాల సర్పంచులు నేలపూడి బేబీ, అల్లం పద్మావతి, గణేశుల శేషవేణి, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసు, విద్యుత్ శాఖ ఎఇ రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు!

చీకటి మాటున వ్యాపారం - దుకాణంలో కొని బయట రూ.30 పెంచి అమ్మకాలు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలను నిషేధించినప్పటికీ ఆచంట నియోజకవర్గంలో చీకటి మాటున బెల్టు షాపుల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బెల్టు షాపుల ద్వారా ఆదాయం దండిగా ఉండడం, వీటి నిర్వహణకు కూటమి ప్రభుత్వం పరోక్షంగా సహకరించడంతో గతంలో ఎన్నడూ లేనంతగా ఇవి పెరిగిపోయాయి. గుడి, బడి అని తేడా లేకుండా దాదాపు ప్రతి కిళ్లీషాపు, రెస్టారెంట్‌లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో మేజర్ గ్రామాల్లో మూడు నుంచి నాలుగు మైనర్ గ్రామాల్లో ఒకటి లేదా రెండు బెల్ట్ షాపులు మాత్రమే నడిచేవి. ప్రస్తుతం మేజర్ గ్రామాల్లో 10 నుంచి 15, మైనర్ గ్రామాల్లో ఐదు నుంచి ఏడు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. నిరుద్యోగులకు

బెల్టుషాపులో మద్యం తాగుతున్న మందుబాబు

ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూపకపోవడం బెల్టు షాపుల ద్వారా ఆదాయం ఉండడంతో పలువురు వీటి వైపు ఆకర్షితులవుతున్నారు. మద్యం విధానంలో నిబంధనల మేరకు వ్యవహరించాలని ఎవరైనా అదుపు తప్పి వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రస్తుతం వాటి ఊసే పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో జనావాసాల మధ్య బెల్టు షాపులు నిర్వహించడంతో మద్యం మత్తులో మందుబాబులు సమీపంలోని ఇళ్ల వద్దకు వెళ్లి తలుపులు తడుతుండడంతో నిత్యం గ్రామాల్లో గల్లాట తప్పడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేరు. జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు మొక్కుబడిగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తప్ప పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఒక మద్యం షాపు నుంచి నెలవారీ సిండికేట్లు పెద్ద ఎత్తున మామూళ్లు చెల్లిస్తుండడంతో వారు అటువైపు చూడటం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ భాషా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూర్చొని మాట్లాడుకుంటే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా సూచించారు. శనివారం తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 220, ప్రీ లిటిగేషన్ కేసులు 36, బెంచ్ కోర్ట్ కేసులు 1190 మొత్తం 1,469 కేసులు రాజీ అయినట్లు తెలిపారు. వాటి విలువ రూ.144,43,104 ఉంటుందన్నారు. నాలుగు లోక్ అదాలత్‌ల్లో 3,351 కేసులు రాజీ అయ్యాయన్నారు. ఐదు బెంచులుగా నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితాదేవి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి జుడీషియల్ మెంబర్స్‌గా, అడ్వకేట్ మెంబర్స్‌గా శిరిగినీడి విజయ్‌కృష్ణ, రవీంద్రకుమార్, వి.ధనలక్ష్మి, కె.మహాలక్ష్మి, కె.మణిరాజు వ్యవహరించారు. అనంతరం కోర్టు ఆవరణలో కక్షిదారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకృష్ణ భోజన ఏర్పాట్లు చేశారు.


తాడేపల్లిగూడెం : 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

నరసాపురం : పౌరులు సత్వర న్యాయం పొందడానికి లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని నరసాపురం 10వ జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఎ.వాసంతి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం ఉదయం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్ ప్రారంభం సభలో ఆమె మాట్లాడారు. న్యాయస్థానాల్లో వివాదాలు పరిష్కరించుకోవడానికి, వాటి ఫలాలు పొందడానికి చాలా సంవత్సరాలు నిరీక్షించాల్సి వస్తుందన్నారు. సుదీర్ఘ కాలయాపన వల్ల వ్యయ ప్రయాసలతో బాటు మానసిక వ్యథ కూడా కక్షిదారులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా అతి తక్కువ సమయంలో ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని వాసంతి వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు మాట్లాడుతూ పౌరులు తమ సమస్యల్ని పరిష్కరించుకోవడానికి న్యాయస్థానాలను ఆశ్రయించడం తప్పనిసరి అవుతుందని అన్నారు. అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.రాజ్యలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ విన్నా సూర్యప్రకాశ్, సీనియర్ న్యాయవాది కానూరి స్వామి నాయుడు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కక్షిదారులకు సీనియర్ న్యాయవాది కానూరి స్వామి నాయుడు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 87, సివిల్ కేసులు 37, మోటార్ ప్రమాద బీమా కేసులు 1, ఎక్సైజ్ కేసులు 94, మనోవర్తి కేసులు 6, చెక్ బౌన్స్ కేసులు 5, బెంచ్ కోర్ట్ కేసులు, ప్రీ లిటిగేషన్ 257 మొత్తం 487 కేసులు పరిష్కరించగా రూ.1, 91, 57,132 కక్షిదారులకు లబ్ధి చేకూరినట్లు న్యాయమూర్తి ఎ. వాసంతి తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వివిఎస్ఎన్.లక్ష్మి లావణ్య మాట్లాడుతూ ఈ అదాలత్‌లో ఐపిసి కేసులు 51, చెక్కు బౌన్స్ కేసులు 3, మనోవర్తి కేసులు 3, ఎక్సైజ్ కేసులు 65, తనఖా దావా-1, క్రయ అగ్రిమెంట్ దావాలు-1, తదితర కేసులు మొత్తం 468 పరిష్కరించామని తెలిపారు. బెంచ్ కోర్టు కేసులు ద్వారా రూ. 6,76,110, ఎక్సైజ్ కేసులు ద్వారా రూ. 1,68,906, రుసుము రాబట్టడం జరిగిందని, వివిధ కేసులలో బాధితులకు రూ.12,34,704 పరిహారం ఇప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

పాలకొల్లు : మాట్లాడుతున్న జడ్జి వివిఎస్ఎన్.లక్ష్మి


ఆదివిష్ణుశేషును అభినందిస్తున్న నాయకులు

మల్లవరం ఇన్‌ఛార్జి సర్పంచిగా ఆదివిష్ణుశేషు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మల్లవరం ఇన్‌ఛార్జి సర్పంచిగా పులఖండం ఆదివిష్ణు శేషు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శేషు ఉపసర్పంచిగా పనిచేస్తున్నారు. ఇన్‌ఛార్జి సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన శేషును పాలకవర్గ సభ్యులతో పాటు పలువురు అభినందించారు. ఇప్పటి వరకూ సర్పంచిగా పనిచేసిన సుజాతను నిధుల దుర్వినియోగం ఆరోపణలతో జిల్లా అధికారులు నాలుగు నెలలు సస్పెండ్ చేశారు. ఆమెతో పాటు నాలుగేళ్లుగా పని చేస్తున్న కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

సెల్‌ఫోన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్టులో స్త్రీ శిశ సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు, అంగన్వాడీ కార్యకర్తలకు, బిపిఒలకు సెల్ ఫోన్లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికారి అంగర కృష్ణ కుమారి శనివారం తెలిపారు. దీనిలో భాగంగా పెనుమంట్ర ప్రాజెక్టుకు 221 మొబైల్ ఫోన్లు పంపిణీ చేసేందుకు గాను ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి చేరాయని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చేతులమీదుగా ఈ సెల్ ఫోన్లు పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గోవా తరహాలో పేరుపాలెం బీచ్‌ను మారుస్తాం

ప్రజాశక్తి - నరసాపురం

పేరుపాలెం సాగర తీరానికి గోవా తరహాలో ప్రాచుర్యం లభించేలా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో 2026 నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డిసెంబరు 31వ తేదీన పేరుపాలెం సాగర తీరంలో నిర్వహించే కార్యక్రమాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సహజ సౌందర్యాలతో, అలల కనువిందుతో అలరారుతున్న పేరుపాలెం బీచ్‌కు ఆశించిన స్థాయిలో ప్రాచుర్యం, అభివృద్ధి చెందలేదన్నారు. ఈ బీచ్ ప్రాంతాన్ని ఆంధ్రా గోవాగా అభివృద్ధి చేయాలనే తలంపుతో శ్రీకారం చుట్టామన్నామన్నారు. 2026 నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని డిసెంబర్ 31వ తేదీ రాత్రి 7 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జబర్దస్త్ టీమ్ స్కిట్లు, డీజే జోడి డిగ్రీతో డాన్స్ కార్యక్రమాలు, వన్స్ మోర్ వాసు మిమిక్రి, సినీ గాయకుల పాటలతో సింగింగ్ షో, మ్యూజికల్ నైట్ వంటి వినోద కార్యక్రమాలను రావు, వెంకటేష్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నాయకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొనేవారు ఈవెంట్ మెనేజ్మెంట్ నంబర్ 9000466522కు సంప్రదించాలన్నారు.

'పాఠశాలల సమీపంలో మాదకద్రవ్యాల విక్రయం తగదు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న పాన్ షాపుల్లో గుట్కా, తంబాకు, సిగరెట్ వంటి నిషేధిత పదార్థాల విక్రయాలు తగదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్కూల్లోని ఒక విద్యార్థిని ఉపాధ్యాయుడు ఆ దుకాణానికి పంపి, గుట్కా ప్యాకెట్లు కొనిపించినట్లు స్థానికులు కొందరు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి ఉపాధ్యాయులను ప్రశ్నించగా, పాన్‌షాపుల్లో నిషేధిత సరుకులు అమ్మకాలు జరుగుతున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు విద్యార్థిని పంపినట్లు చెప్పారు. విద్యార్థిని అలా పంపడం తప్పు అనుకుంటే క్షమించాలని సదరు ఉపాధ్యాయుడు వారికి సర్ది చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ షాపులో విక్రయాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్కూల్ హెచ్ఎం బిడి.సరస్వతి తెలిపారు. పోలీసులు వచ్చే సరికి సదరు పాన్ షాప్ వ్యాపారులు షాపులు మూసి వెళ్లిపోయారని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత డివైఇఒ మురళీ సత్యనారాయణను వివరణ కోరగా విషయం తెలిసిందని, సోమవారం దీనిపై సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలకు కృషి

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

పేదలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం నరసాపురం ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రతి విభాగాన్నీ పరిశీలిస్తూ డాక్టర్లు, నర్సులు విధుల్లో సమయానికి వస్తున్నారో లేదో వ్యక్తిగతంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగం నుండి ఔషధాల పంపిణీ కేంద్రం వరకూ అన్ని సేవల పనితీరును పరిశీలించారు. శుభ్రత, పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్యసేవల స్థాయిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు ఏమిటో తెలుసుకున్నారు. చికిత్స నాణ్యత, డాక్టర్ల స్పందన, సిబ్బంది ప్రవర్తనపై రోగుల అభిప్రాయాలు విన్నారు. వెంటనే పరిష్కరించాల్సిన అంశాలను సంబంధిత విభాగాధిపతులకు ఆదేశించారు. ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించడమే తన ముఖ్య లక్ష్యమని ఎంఎల్ఎ నాయకర్ స్పష్టం చేశారు. ఆరోగ్య రంగ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామన్నారు.

మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శారీరిక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆర్‌డిఒ కౌసర్ భానో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ గోదావరి క్రీడా ఉత్సవాలను స్థానిక శశి ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం ప్రారంభించారు. ఈ క్రీడల్లో 23 డిపార్ట్మెంట్లకు సంబంధించిన 450 మంది క్రీడాకారులు తొమ్మిది రకాల క్రీడల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

తుది దశకు సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 సాఫ్ట్ బాల్ పోటీలు నాకౌట్ దశకు చేరుకున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పిఎస్ఎన్ మల్లేశ్వరరావు, దాసరి సునీత శనివారం తెలిపారు.

రెండో రోజు బాలికల ఫలితాలు ఇలా

విజయనగరం జిల్లా బాలికల జట్టు గుంటూరు బాలికల జట్టుపై 02:01 తేడాతో, ప్రకాశం జిల్లా బాలికల జట్టు విశాఖపట్నం జట్టుపై 11:01 తేడాతో, అనంతపురం జట్టు ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జట్టుపై 11:01 తేడాతో, వైఎస్ఆర్ కడప జట్టు శ్రీకాకుళం జట్టుపై 08:04 తేడాతో, పశ్చిమగోదావరి జిల్లా జట్టు తూర్పుగోదావరి జిల్లా జట్టుపై 02:01 తేడాతో, విజయనగరం జట్టు కృష్ణా జట్టుపై 04:01 తేడాతో గెలుపొందాయి.

బాలికల క్వార్టర్ ఫైనల్ ఫలితాలు..

పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రకాశం జట్టుపై 19:09 తేడాతో, విజయనగరం జట్టు శ్రీకాకుళం జట్టుపై 12:01 తేడాతో, తూర్పుగోదావరి జట్టు అనంతపురం జట్టుపై 05:01 తేడాతో, కడప జట్టు గుంటూరు జట్టుపై నెగ్గి సెమీఫైనల్ లోకి ప్రవేశించాయి.

బాలుర ఫలితాలు ఇలా..

విజయనగరం జట్టు విశాఖ జట్టుపై 3:00 తేడాతో, తూర్పుగోదావరి జిల్లా జట్టు నెల్లూరు జట్టుపై 02:00 తేడాతో, గుంటూరు జట్టు కర్నూలుపై 13:00 తేడాతో, పశ్చిమగోదావరి జిల్లా జట్టు అనంతపురం జట్టుపై 07:01 తేడాతో, కడప జట్టు కృష్ణ జట్టుపై 01:00 తేడాతో, విజయనగరం జట్టు చిత్తూరు జట్టుపై 05:00 తేడాతో విజయం సాధించాయి.

విజయనగరం జట్టు ప్రకాశంపై నెగ్గి, గుంటూరు జట్టు కడప జట్టుపై నెగ్గి, పశ్చిమగోదావరి జట్టు విశాఖ జట్టుపై నెగ్గి సెమీఫైనల్ లోకి ప్రవేశించాయి. రేపు ముగింపు కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర బాల బాలికల జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాజోంకి శ్రీనివాస్ తెలిపారు.

వైసిపి హయాంలో ప్రజాధనం లూటీ

టిడిపి గ్రామ బూత్ కన్వీనర్ రఘుకుమార్

ప్రజాశక్తి - ఆచంట

గత ప్రభుత్వ హయాంలో వైసిపి సర్పంచులుగా ఎన్నికై అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని లూటీ చేసి దోపిడీకి పాల్పడ్డారని టిడిపి గ్రామ బూత్ కన్వీనర్ ముప్పిడి రఘుకుమార్ విమర్శించారు. శనివారం కొడమించిలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదు మేరకు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ విచారణకు ఆదేశిస్తే, తమ తప్పులను, దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి, అక్రమ ఎంక్వయిరీలు అంటూ నాటకాలు ఆడి సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పదవులను అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని లూటీ చేసి అంతస్తులు నిర్మించుకున్నది అబద్ధమా వైసిపి నేతలను ప్రశ్నించారు. ఈ దోపిడీలు, దౌర్జన్యాలు భరించలేక ఎన్నికల్లో జనం మిమ్మల్ని ఛీ కొట్టారని విమర్శించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుండా ఎదుటివారి మీద నిందలు వేసి తప్పించుకోవాలని చూస్తే, ప్రజలే భవిష్యత్‌లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలుకూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి, బాలం వెంకటరమణ, రాపాక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక ఆలోచనలు చేయాలి

భీమవరం టౌన్ : పరిశోధనాత్మక ఆలోచనలు ఆచరణలో ఉత్పత్తులు తీసుకురావాలని పరిశోధనకు పేటెంట్ కూడా పొందొచ్చని ఐఐటి హైదరాబాద్ సిఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ ఎంవి.పాండురంగారావు పేర్కొన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ప్రోగ్రాం ఛైర్ సిఎస్‌సి హెడ్ డాక్టర్ బిహెచ్ విఎస్.రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఐఐటి ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ పరిశోధనలు నిరంతరం కొనసాగించాలన్నారు. జెఎన్‌టియు కాకినాడ సిఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులో పేపర్లు అదేస్థాయిలో ఉండేలా పరిశోధకులు వాటిస్థాయి పెంచే విధంగా తీర్చి దిద్దాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యా పరిశోధన రంగాలకు అధిక ప్రాధాన్యతిస్తోందని, అందువల్లే అంతర్జాతీయ సదస్సులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడారు. కన్వీనర్ ఆర్ఎన్‌వి.జగన్మోహన్, కో కన్వీనర్ జిఎన్‌విజి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P.No.209/2025 in O.S.No.882/2024

Between:-

సాగి వెంకట సత్యనారాయణ వర్మ ...DHR/వాది

మరియు

గుండుగొంటి శ్యామలరావు ...JDR/ప్రతివాది

To.

గుండుగొంటి శ్యామలరావు తండ్రి రామస్వామి, ఇంటినెం.11/115/2, హరి జనపేట, చింతలపూడి, ఏలూరు జిల్లా.

పై నెంబరు అమలు గ్రంధములో JDR అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.05-01-2026సం॥రం తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
చిత్తలూరి వెంకట సుబ్బారావు
న్యాయవాది, కాకినాడ
సెల్.9948519236

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామం, చింతలపాలెంకు చెందిన జుత్తిగ నాగరాజు తండ్రి ఏడుకొండలు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నడిపూడి నుండి తణుకు వెళుతుండగా మార్గమధ్యంలో సిద్ధాంతంలో పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ : U1851692 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

జుత్తిగ నాగరాజు, తండ్రి : ఏడుకొండలు
చింతలపాలెం, నడిపూడి,
పెనుగొండ మండలం
ప.గో.జిల్లా. సెల్ : 8688531452

పాస్‌పోర్టు పోయినది

సోడదాసి అరుణ, భర్త: డేవిడ్ రాజు, డోర్ నెంబర్ 10-149, మోడీ ఎల్ ఎన్ పురం, బొండాడ, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా,ఎ.పి. ప్రజలకు తెలియజేయునది ఏమనగా.. నేను ది 09-04-2014లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ L8453230, పాస్ పోర్ట్ పొందియున్నాను. ది.25-11-2025న భీమవరం నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరు బస్‌లో వచ్చి అక్కడ నుంచి వెంకటాపురం బైక్ మీద జెరాక్స్ సెంటర్‌కు రాగా (నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు, పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మాట్లాడటానికి రాగా) నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.
నా సెల్ నెంబర్ **9515421283**

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

Creditor I.P.No.27/2025

Between:

కొత్తపల్లి నాగరాజు, S/o.సూర్యారావు, డోర్‌నెం.9-51, రామాలయం వీధి, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా. ...పిటీషనర్/క్రెడిటర్

1.జంపా శ్రీనివాస్, S/o.(లేటు) వెంకటస్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
2.జంపా పద్మ కుమారి, W/o.(లేటు) వెంకట స్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
3.జంపా నాగ శివాంజనేయులు, S/o.(లేటు) వెంకటస్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
4.జంపా రవళి, W/o.జంపా నాగ శివాంజనేయులు, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
5.అఫీషియల్ రిసీవర్, జిల్లా కోర్టు, ఏలూరు. ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్, 1వ రెస్పాండెంట్‌ను ఇన్ సాల్వెంట్‌గా డిక్లెర్ చేయమని అతను 3 నుండి 4 రెస్పాండెంట్ పేరున వ్రాసిన క్రయదస్తావేజులను డాక్యుమెంట్ నెం.3463/ 2025. 3464/2025, 3465/2025 S.R.O. మొగల్తూరు, రద్దు చేయమని కోరుచూ (ఇన్‌సాల్వెంట్ పిటీషన్) దాఖలు చేసియున్నందున సదరు విషయమును పుర ప్రముఖులకు తెలియ జేయడమైనది. 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లెయిర్ చేయుటకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల పిటీషన్ వాయిదా రోజున అనగా ది.05.01.2026వ తేదీన ఉదయం 10.30 ని.లకు మీరు స్వయముగా గాని, ప్లీడర్ ద్వారా గాని పైకోర్టు నందు హాజరు అయి మీ వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ తీర్మానము చేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి అనుమతితో ఆర్డర్ తేది.5.12.2025

వైదాని మోహన్
నరసాపురం న్యాయవాది, ఏలూరు.
తేది.13-12-2025 సెల్: 9505159177